# వెనుకచూపు

మధ్యాహ్నం యింటర్‌వెల్‌లో టేబిల్ ముందర, డ్రాయర్ వళ్ళోకి లాక్కొని యెరియర్ వర్కు మేకప్ చేస్తూ కూర్చున్నాను ఒక్కణ్ణే. తోడి క్లర్కులంతా కాస్త ముందుగానే బయలుదేరి యిళ్ళకు పోయారు.

ఇవాళ విజయదశమి – పండగ – వాళ్ళకి యిళ్ళున్నయ్ – ముందుగా పోయారు. ఇల్లూ వాకిలీ లేని వాణ్ణి నేనొక్కణ్ణే – ఆఫీసులో పడున్నాను.

కనకయ్య తలుపులు మూసుకుంటూ వచ్చి నా దగ్గర ఆగి పలకరించాడు.

"ఇంటికెళ్ళరా? బాబూ"

"మనకు యిల్లెక్కడిదోయ్"

నిస్పృహగ అన్నాను వెనక్కు చారబడుతూ.

"అయితే తాళాలొదిలీతునా?"

"నువ్వింటికి పోతావా?"

"బాగుంది బాబూ! పండుగు పూట యిక్కడెవడు పడుంటాడు!"

"మీరు కూడా పూజ చేస్తారేమిటోయ్?"

''ఆఁ... ఆఁ. ఇయాళ గొర్రెపోతు లేస్తాం. అలవాటున్నోళ్ళు కసింతో కుసింతో నిసా సేస్తారు. యియాళ కూడా పెద్దపండుగే. ఆలెస్సమయి పోతోంది. తాళాలియిగో...టి... నేనెల్తాను మరి... తాళాలు తియ్యండి".

"తీస్తాలే నువ్వెళ్ళు".

ఆలోచనలో పడుతున్న బుర్రని కాస్త ఓసారి అటు మళ్ళించి మళ్ళా ఆలోచనలో పడ్డాను.

ఇవాళ అందరికీ పండగే.

నాకు మాత్రం పదిహేను రోజుల క్రిందటే పండగ అయిపోయింది.

పదిహేను రోజుల క్రిందట శలవు తీసుకొని యింటికి వెళ్ళాను.

"పండుగ పది రోజులు పెట్టుకొని ముందుగా వచ్చీశావేరా నాయనా?" అంది అమ్మ... అసంతృప్తితో. పండుగ కోసం చూస్తూ కూర్చుంటే రావటమే పడకపోవచ్చని అమ్మకు తెలియదు. సత్యంకు బాగా తెల్సొచ్చింది.

ఈ శలవు పండుగకే పెట్టి యింటికి వెళ్తే – తల్లిదండ్రులు పండగ నాడు యింటి దగ్గర వున్నందుకు సంతోషిస్తారు అంటూ తనను కూడా నాతోనే శలవు పెట్టి యింటికి ఓసారి పొమ్మని నేనంటే నా మాట లెక్క చేశాడు కాదు.

నేనింకా బోధపరచాను.

"పండగకు అందరూ శలవు కావాలంటారు. అందరికీ గ్రాంటు చేసి ఆఫీసు మూసేయరు కదా. కొందరి అప్లికేషన్సు విధిగా రిజక్టయి తీరుతాయి. ఆ దురదృష్ట వంతుల్లో నువ్వు ఒకడివి కావచ్చు. యిప్పుడయితే అనుమానం లేకుండా శలవు శాంక్షనవుతుంది. ఈ దినం పండగ – అంటూ ప్రత్యేక దినాలను సృష్టించింది మనిషే కదా. మనం యే రోజు యింటి దగ్గర వుంటే ఆరోజే మనకూ, మన వాళ్ళకూ పండగ అనుకుందాం" అని.

అమ్మతో కూడా యిలానే చెప్పాను. మింగరాని ముద్ద మ్రింగుతున్నట్టు 'అవును మరి' అంది. కాని సత్యం మాత్రం వినలేదు. మొన్న సాయంత్రం ఆఫీసరుగారి దగ్గర్నుంచి వస్తూ, "నువ్వు చెప్పిన మాట విన్నాను కాదురా బాబూ" అంటూ రిజెక్టెడ్ అప్లికేషన్ చూపించాడు. అప్పటికప్పుడే ధన్యంరాజుకూ, స్వామికీ లీవ్ గ్రాంటయిపోయింది. మనవాడి అప్లికేషన్ చాలా లేట్‌గా అందింది.

కాని సత్యంకు వాళ్ళ బావా అక్కా వున్నారు. ఇవాళ వాళ్ళింటే పూజా, భోజనం కూడా.

నా మాటో...

పూజా లేదు – బుగ్గీ లేదు–

రాత్రి ఏవేవో వెర్రి భావాలతో కొట్టుకు చచ్చి చచ్చి ఆలస్యంగా నిద్రపోయి ఉదయం లేవడం ఎనిమిది గంటలకు లేచాను. ఎనిమిదింటికే ఆఫీసు – యింకేం పూజ –

కొసకు స్నానమైనా లేకండా కాఫీ హోటల్లో దూరాను యివాళ.

కాని కాలం ఎంత మార్పు తెస్తుందీ!

నా చిన్నప్పుడు – పదేళ్ళ క్రిందట – ఒక విజయదశమి –

నాకు కాస్త జ్ఞానం వచ్చిన దగ్గర నుంచీ సరస్వతీ పూజ ఆరంభించాను. బడిలో పూజ చేసుకొని వచ్చిన తర్వాత యింటి దగ్గర నాన్నతో కూడా సరస్వతీ పూజ చేసేవాణ్ణి. మరీ చిన్నవాణ్ణయి వున్నప్పుడు నాన్నగారు పన్నెండు గంటలకు పూజ చెయ్యడం అలవాటవడం చేత అప్పటి వరకూ నేను ఉపవాసం వుండడం కష్టమని అమ్మ బడిలో పూజ చేసుకుని వచ్చాక చద్దన్నం తినీసి కావలస్తే నాన్నగారు పూజ చేసేటప్పుడు దూరంగా నమస్కరిస్తూ కూర్చోవచ్చని చెప్పేది.

అందుచేత పట్టుపట్టి పన్నెండు గంటల వరకూ ఉపవాసం వుండి నాన్నగారితో పూజ చెయ్యడం మానేవాణ్ణి కాదు–

ఒకసారి–

ప్రతి సంవత్సరం వినాయక సరస్వతీ పూజలు రెంటికీ ఉదయానే – యింకా చీకట్లు పూర్తిగా విడకుండానే – లేచి

జగన్నాథస్వామి ఆలయం లోనూ, శివాలయంలోనూ వున్న పూలూ, ఇంకా యెక్కడెక్కడ వున్న పూలు కోసుకొచ్చే వాణ్ణి, పూజా పుష్పాల రాసినిబట్టి. నా భక్తిని కొలుస్తుండే వాణ్ణి. పువ్వులు సంపాదించడంలో అత్యాసతో ఎదుటింటి సుందరికీ మా పెదనాన్న గారికీ పువ్వులు దొరకకుండా జాగ్రత్తపడుతూ అన్నీ నేనే ఏరుక వచ్చేవాణ్ణి.

ఒక సరస్వతీపూజకు –

ఉదయాన్నే లేచి దగ్గరగా ఊరులో వున్న జగన్నాథ స్వామి ఆలయం లోని పువ్వులన్నీ ముందుగా ఏరీసాక, యింక శివాలయంకు పోదామను కుంటూ వచ్చేస్తుంటే అర్చకుని యింటి ముందర పెద్ద గులాబీ మొక్క దృష్టి నాకర్షించింది. ఆమధ్య కొమ్మ చివరనున్న పెద్ద గులాబీ పువ్వు ముందరికి అడుగు వెయ్యనిచ్చింది కాదు. అర్చకుడు – అతని పేరు స్వామి – ఎక్కణ్ణుంచయినా చూస్తున్నాడేమోనని ఓసారి నాల్గువంకలా చూశాను. యెక్కడా అగపడలేదు. మెల్లగా మొక్క దగ్గరకు వెళ్లాను. కమ్మటి కషాయగంధం ఆ పువ్వు సౌందర్యం ఆనాడు నన్నెలా కదిలించేయో జ్ఞాపకం లేదు. కాని చాలాసేపటి వరకూ అక్కడే వుండి పోయానని జ్ఞాపకం. చివరకు ఆ పువ్వు తాలూకా రేకు ఒకటి తృంచాను. భయం వేసింది కావోలు పరుగెత్తాను – అలా యించుమించు వూరు దాటిందాకా పరిగెత్తినట్టు జ్ఞాపకం. వూరు దాటాక తాపీగా శివాలయం వంక నడుస్తున్నాను – ఆలయం ఊరు బయటనే వుంది.

నాకు గులాబీ పువ్వులు తినడం చాలా ఇష్టం. నడుస్తూ నడుస్తూ యెప్పుడు పడేసుకున్నానో గులాబీరేకు నోట్లో పడేసుకొని తినీశాను.

వెంటనే జ్ఞాపకం వచ్చింది – ఆవేళ సరస్వతీ పూజ – ఉపవాసం... అని.

అప్పుడు నేను పడ్డ తపన ఎలా చిత్రించను. ఆ తపన తీవ్రత వర్ణించే శక్తి అయినా నాకు లేదు–

ఆదర్శశీలయైన వ్యక్తి అన్‌కాన్‌షస్‌గా తన శీలాన్ని కోల్పోయి వెలితి వచ్చి చూసుకున్నప్పుడు –

చాందస బ్రాహ్మణుడు తనకు తెలియకండా జాతిని పోగొట్టుకొని తెల్సుకున్న తర్వాత –

పొందే తీవ్రమయిన తపన పొందాను–

ఏడ్చాను – యెంతో పశ్చాత్తాపపడ్డాను – సరస్వతీదేవిని యీ ప్రమాదానికి అతి దీనంగా మనసులో క్షమాపణ వేడాను. ఎందుచేతో దేవి క్షమిస్తుందని నమ్మలేకపోయాను.

చివరకు నాయీ గొప్పతప్పిదాన్ని చనువు యెక్కువగా గల పెదనాన్న గారితో చెప్పి పరిహారం అడిగాను.

ఆయన చివరి వరకూ విని కొంచంగా నవ్వి తప్పులు చెయ్యడం మానవ సహజం అనీ, పశ్చాత్తాపడ్డాను కాబట్టి యింక పరిహారం అవసరం లేదనీ, యింకా భక్తితో పూజ చెయ్యమనీ దేవి క్షమించే వుంటుందని ధైర్యం చెప్పారు –

ఈ ఔషధం వల్ల గాయం నుండి రక్తం కారడం కట్టింది కాని నొప్పి, గాయం పోలేదు. ఆనాడల్లా బాధపడ్డాను –

యెన్నో గాయాలు కాలం గడిచాక మచ్చైనా లేకండాపోతాయి – యిదీ అంతే.

నమ్మకాలనూ – హృదయాలనూ – మనుష్యలనూ కాలం మార్చేస్తుంది. నేను మారిపోయాను – అందులోనూ గత సంవత్సరం మధ్య నేను నేనా అనుకునే అంతగా మారిపోయాను. ఆ మార్పు యెంత వేగంగా తోసుక వస్తోందీ అంటే తిరిగి చూడటానికైనా వీలీయనంత వేగంతో. యివాళ కొంచంగా వెనక్కు చూడగలిగాను – ★

*(ఆనందవాణి: 18, ఫిబ్రవరి – 1945)*